కథ

# చేదు గారెలు

ఓ. విద్యేశ్వరి

రామకృష్ణ మనసంతా చెప్పలేని ఆనందంతో ఒకలాంటి ఉద్వేగంతో ఎగిసి పడుతోంది. ఇరవై సంవత్సరాల తరువాత స్వంత ఊరికి వస్తున్నాడు. టెన్త్ వరకూ పుట్టి పెరిగిన ఊర్లో చదివి, ఇంటరు, ఐఐటికోచింగ్‌లకి హైదరాబాదు వచ్చేశాడు. పిల్లల చదువుల కోసమని కుటుంబం అంతా హైదరాబాదులో స్థిర పడితే, ఊళ్లో స్వంత ఇంటిని, పొలాలు, తోటలను భాస్కరం బాబాయి నిర్వహించే ఏర్పాటు కుదిరింది. ఆయన పిల్లలు కూడా తమతో పాటే చదువుకునేవారు. రామకృష్ణ తండ్రి చిన్న కమీషన్ ఏజెంటుగా వ్యాపారం ప్రారంభించి, బిజినెస్ మాగ్నెట్‌గా ఎదగడం అంచెలంచెలుగా జరిగిపోయింది. ఐఐటి తరువాత ఎమ్ఎస్‌కి అమెరికా వెళ్లిన రామకృష్ణ ఉద్యోగం కూడా సంపాదించి, అక్కడే సెటిలయిపోయాడు. పెళ్లి కూడా చెన్నయ్ అమ్మాయితో కావడంతో స్వంత ఊరికి వెళ్లాల్సిన అవసరం, టైము రెండూ లేకపోయాయి. మంచికి, చెడుకే కాక, పిల్లల్ని చూడాలని ఏడాదికి నాలుగైదు సార్లు పిన్ని, బాబాయి హైదరాబాదు వస్తుండడంతో రామకృష్ణకి, అతని భార్యా పిల్లలకి స్వంత ఊరు వెళ్లాల్సిన పని పడలేదు.

మూడేళ్ల క్రితం తండ్రిపోయినప్పుడు భాస్కరం బాబాయిని చూశాడు. సంవత్సరీకాలకి ఆయన అత్తగారు పోవడంతో పిన్ని, బాబాయి రానేలేదు. బాబాయి పెద్దవాడైపోయి ఉంటాడు. డెబ్బైయేళ్లు దాటాయంటే పెద్దవాడైపోడా! రామకృష్ణ ఆలోచనలు బస్ వేగంతో సమానంగా పరిగెడుతున్నాయి.

చిన్నతనంలో ఉమ్మడి కుటుంబంలో పెరగడం, పల్లెటూళ్లలో ఆప్యాయతలు ఎలా ఉంటాయో తెలియడం వలన రామకృష్ణకి స్వజనం పట్ల అభిమానం కొంచెం ఎక్కువే. అమెరికాలో పుట్టిన అతని పిల్లలు ''మామ్! డాడీ కొంచెం సెంటీఫెలో కదా'' అని పరిహాసం చేస్తున్నా అతడు పట్టించుకోడు.

ప్రాజెక్టు పనితో స్వంత పని కూడా కలుపుకుని దేశం రావడం వలన స్వంత ఊరికి ప్రయాణం కాగలిగాడు. ఈ ప్రయాణానికి మరో రెండు కారణాల వల్ల కూడా టైము దొరికింది. ఆ రెంటిలో ఒకటి, భార్యా పిల్లలతో కాకుండా ఒక్కడే రావడం, వాళ్లు కూడా వస్తే వాళ్ల షాపింగులు, విజిట్స్‌కే టైము చాలదు. రెండోది అత్తగారు, మామగారు సింగపూర్ చిన్న కూతురి దగ్గరకు వెళ్లడం. చెన్నై వెళ్ల వలసిన రెండు మూడు రోజులు స్వంత ఊరు ప్రయాణానికి కేటాయించుకోగలిగాడు.

బస్ ఏదో ఊళ్లో ఆగింది. జనాలు ఎక్కుతున్నారు. కొందరు దిగుతున్నారు. అంతా ఒకటే గోలగా ఉంది. బాగ్‌లోంచి నీళ్ల సీసా తీస్తుంటే...''కృష్ణా!ఎప్పుడొచ్చావురా'' అనే పిలుపు వినిపించి, కిటికీలోంచి చూశాడు. పార్వతి అత్తయ్య కొడుకు రాజు. కృష్ణ ముఖంలో సంతోషం విరిసింది. సమాధానం చెప్పేలోపునే రాజు మాయమైపోయాడు. బస్ ప్రత్యక్షమై....

''ఏరా! మా ఊరి మీద నుంచి వెడుతూ ఇక్కడ ఆగవా? దిగు..దిగు...'' అంటూ నీ బ్యాగేది అంటూ సమాధానం చెప్పేలోపే బ్యాగ్ పుచ్చుకొని సీట్లోంచి లేపేశాడు. బస్ దిగి రిక్షా ఎక్కాకకానీ రామకృష్ణ తన ప్రయాణం ఎక్కడి దాకానో చెప్పలేకపోయాడు.

''సరేలే! మంచిదే నాకు కనిపించావు. ఏదో ఫంక్షనుందని అత్తయ్య, మామయ్య ఊరెళ్లారు. తిన్నగా అక్కడికి వెళ్లుంటే అనవసరంగా ఇబ్బంది పడేవాడివి.''

''బాబాయిని తప్పకుండా చూడాలనుకున్నాను. అయితే కుదరదంటావా?'' నీరసపడిపోయాడు.

''బెంగపడకురా! ఈ రాత్రికో, రేప్పొద్దిటికో వస్తామని చెప్పాడు మామయ్య. అటు వెళ్లి ఇటు వద్దామనుకున్నావు. ఇటు వచ్చి అక్కడికి వెడతావు అంతేగా'' భుజం తట్టి ఓదార్చాడు.

ఇంటికి వెళ్లాక అత్తయ్య ప్రేమని తట్టుకోగలిగాడు కానీ, ఆవిడ చేసి పెట్టిన వంటకాలన్నీ తినలేక చాలా అవస్థపడాల్సి వచ్చింది. ఈ అవస్థలోనూ ఆత్మీయతను, ఆనందాన్నే చూశాడు. మూడేళ్ల కబుర్లు, ఖర్చులు, జమలు, చిన్న చిన్న కుటుంబ రాజకీయాలు, అమెరికా విశేషాలు అన్నీ మాట్లాడుకున్నారు.

''మీ పెద్దవాడేడిరా? ఏం చేస్తున్నాడు?'' సాయంత్రం కూడా కనిపించకపోతే రాజుని అడిగాడు.

''పని మీద హైదరాబాద్ వెళ్లాడు. రేపు వస్తాడు స్నేహితుడితో కలిసి కంప్యూటర్ సెంటర్ నడుపుతున్నాడు'' చెప్పాడు.

''రాజూ! ఇక పడుకోండిరా! పదకొండు దాటింది. కృష్ణ ప్రయాణం చేసి అలసిపోయుంటాడు'' అత్తయ్య హెచ్చరికతో రాత్రి కబుర్లు ఆపక తప్పలేదు.

తెల్లవారకుండా రాజు పెద్ద కొడుకు, వాడికన్నా ముందే పక్క టౌన్‌లో పీజీ చేస్తున్న చిన్న కొడుకు వచ్చారు. మళ్లీ ముచ్చట్లు మొదలయ్యాయి.

''రాజూ!బాబాయి వాళ్లు వచ్చారేమో ఎలా తెలుస్తుంది? ఫోన్ చేసే వీలుందా?''

''ఫోన్ చేశానురా! ఇందాకే వచ్చారుట. నువ్వు వచ్చావని చెప్పాను.మామయ్య, అత్తయ్య నీకోసం ఎదురు చూస్తున్నారు.భోజనం చేశాక బస్సెక్కిస్తానని చెప్పాను'' రాజు ప్రోగ్రామ్ చెప్పాడు.

''నువ్వూ రారాదురా. ఇంకో రోజు మనం కలిసి ఉండొచ్చు.''

''నేనూ రావాలనే అనుకున్నాను. సాయంత్రం

ఎమ్మార్వోని కలవాలి. మా చిన్నవాడు నీతో వస్తాడు. కృష్ణా! రేపు సాయంత్రానికల్లా వచ్చెయ్యి. ఎల్లుండి నిన్ను నేను బస్సెక్కిస్తాను.'' మాట్లాడుతూనే, అప్పుడే అటు వస్తున్న చిన్న కొడుకుతో...

''చిన్నా, రేపు కృష్ణమామయ్యని భాస్కరం తాత గారి ఊరికి తీసుకెళ్లు. కావాలంటే నువ్వు రాత్రికి తిరిగి వచ్చెయ్యి.''

''అబ్బా! బిట్స్‌కా నాన్నా! అన్నయ్యని పంపకూడదూ?'' వాడి మొహంలో భావం గానీ, వాడి మాటలు కానీ రామకృష్ణకి అర్థం కాలేదు.

''బిట్స్ ఏమిటిరా? వాడేం అంటున్నాడు? అయినా నాకు తోడెందుకు? నేను వెళ్లలేనా?'' అయోమయంగా అడిగాను.

''ఏం లేదులేరా! నువ్వు వెళ్లలేవని కాదు. సెలవులని వచ్చాడుగా. ఊరికే ఉండే బదులు నీకు కంపెనీ ఉంటాడు'' అంటూ అసలు ప్రశ్న దాటేశాడు.

''ఒరేయ్ చిన్నా! బిట్స్ ఏమిటిరా?'' రామకృష్ణ వదల్లేదు.

వాడు మొహమాటంతో మెలికలు తిరిగిపోతున్నాడు. రాజు చెప్పలేక ఇబ్బందిపడిపోతున్నాడు. అప్పుడు అటుగా వచ్చిన పార్వతి అత్తయ్య..

''ఏం ఉందిరా? కుర్రమూకకి పెద్దాళ్లంటే భయం భక్తీ లేకుండా పోయాయి. చిన్నన్నయ్యకి వాళ్లు పెట్టిన ఇంకోపేరు.''

రామకృష్ణ వదిలిపెట్టలేదు.

''ఒరేయ్ రాజూ, మన మధ్య దాపరికాలేమిటిరా? అసలు విషయం చెప్పు''

ఇంక రాజుకి చెప్పక తప్పలేదు.

''కృష్ణా! నువ్వు బాధపడకూడదు. ఈ పిల్లల్లో ఉన్నది నిర్లక్ష్యం అనాలో, క్రియేటివిటీ అనాలో నాకు తెలియడం లేదు. చిన్న మామయ్య ఎదురుగా చాలా మర్యాదగా, వినయంగా ఉంటారు. ఆయన పని చెప్తే చేస్తారు. ఆయన వెనకే ఈ నిక్‌నేమ్స్, జోక్స్ వస్తాయి. నీ పిల్లలు ఇండియాలో ఉండిఉంటే, ఈ పాటికి నీకూ తెలిసేది. మన పిల్లలు అంతా కలిసి చిన్నమామయ్యకు పెట్టుకున్న ముద్దుపేరు బిట్స్.''

''బిట్స్ ఏమిటిరా?''

''అసలు బిట్స్ అంటే ఏమిటో చెప్పు'' ఎదురు ప్రశ్న వేశాడు.

''బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్. మరి ఈ బిట్స్ ఏమిటి?'' రామకృష్ణ ఆశ్చర్యంగా అడిగాడు.

''భాస్కరం ఇంటిగ్రేటెడ్ ట్యూటోరియల్స్'' రాజు ఇచ్చిన వివరణ వింటూనే గుడ్లు తేలేశాడు. చిన్నాగాడెప్పుడో అక్కడి నుంచి జారుకున్నాడు.

''అదేం పేరురా! బాబాయికెందుకు పెట్టారు?'' తేరుకుని అడిగాడు.

''కృష్ణా! మామయ్యని నువ్వు చూసి, ఎన్నాళ్లైందో కానీ చాదస్తం ఎక్కువైందిరా. ప్రతి వాళ్లు చేసే పనిని విమర్శించడం, అడిగినా అడగకపోయినా వెంటబడి సలహాలు ఇవ్వడం, మళ్లీ వాళ్లు కనిపించినప్పుడు తన సలహా పాటించలేదంటే కోపం తెచ్చుకోవడం అలవాటయిపోయింది.''

''అదేం! పొలం పనులు, తోటలు చూసుకోవడం ఉంటుందిగా. ఇంక తీరికెక్కడిది?''

''ఎక్కడి పొలాలు! ఆ మధ్య మామయ్య పొలంలో పడితే కాలు విరిగింది కదా! ఆర్నెల్లు మంచాన ఉన్నాడు. పిల్లలంతా వంతుల వారీగా కుటుంబాలతో సహా వచ్చి అత్తయ్యకి తోడుగా ఉన్నారు. ఇంక మామయ్య పొలం చూసుకోలేడని పొలాలు అమ్మేసి డబ్బు మామయ్య పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇప్పుడున్నదల్లా ఆ పదెకరాల మామిడితోట, ఆరెకరాల కొబ్బరితోట. రోజూ వెళ్లాల్సిన పనేమీ ఉండదుగా. అలా షికారుకెళ్లినట్లు వెళ్లి వస్తుంటాడు.''

''మరి కాలక్షేపం ఎలా?''

''ఇదిగో ఇలాగే. ఆర్నెల్లు మంచం మీద ఉన్నప్పుడు చూడడానికి ఎవరో ఒకరు వస్తూ ఉండేవారు. వాళ్లతో ఆపకుండా ఏదో ఒకటి మాట్లాడడం, ప్రశ్నలు వేయడం అలవాటైంది. కొన్నాళ్లకి అడిగిన వాళ్లకే కాకుండా, అందరి విషయాలు తెలుసుకొని వాళ్లు అడగకపో



యినా సలహాలివ్వడం అలవాటైపోయింది. ఈ చిన్న వాళ్లకి అలా వాళ్ల విషయాల్లో కల్పించుకోవడం, తెలిసినా తెలియకపోయినా సలహాలివ్వడం నచ్చదు. అందుకే ఇలాంటి నిక్‌నేమ్స్ పెట్టుకున్నారు.''

''అదేమిటిరా? బాబాయి సామర్థ్యం, ప్లానింగ్ చూసిన మనకి ఆయనంటే ఎంత ఎడ్మిరేషన్ ఉండేది. పొలం విషయాలైనా, ఇంట్లో పెళ్లి పేరంటాలైనా అందరికీ ఆయన సహాయం చేస్తుండేవాడు. ఇప్పుడెందుకిలా అయ్యాడు?''

''అదేరా, చిన్నప్పటి నుంచి మనం ఆయన్ని ఎరుగుదుం గనుక మనకి ఇప్పటికీ అభిమానం ఉంది. ఈ పిల్లలికి అలా ఎందుకుంటుంది చెప్పు. మా పెద్దవాడిని కూర్చోబెట్టి తనకంతా తెలిసినట్లు కంప్యూటర్ల గురించి మాట్లాడి సలహాలిస్తాడు. చిన్నవాడు కనిపిస్తే, పీజీలో ఎంత కష్టపడి చదవాలో, తను చెప్పినట్లు విన్నవాళ్లు ఎందరు క్లాసులు తెచ్చుకున్నారో, వినని వాళ్లు ఎలా చెడిపోయారో చెప్తాడు. వీళ్లకవి నచ్చవు. ఆయన ఎన్ని పీజీలు చేశారు నాన్నా అంటాడు వీడు. పిల్లలంతా చేరినప్పుడు మాట్లాడుకుంటుంటే ఈ బిట్స్ పేరు గురించి మాకు తెలిసింది.''

''నిజంగా బాబాయి అంత మారిపోయాడా? నమ్మలేకపోతున్నాను.''

''వెడుతున్నావుగా నువ్వే చూడు. నీకంటూ ఏదో కాలక్షేపం పెట్టుకో అని చెప్తే నా మాట కొట్టిపారేశాడు. వాళ్లు అడగకుండానే అందరికీ ఎందుకలా చెప్తారంటుంది అత్తయ్య.

పెద్దవాళ్లం మనం చెప్పకపోతే వాళ్లకెవరు చెప్తారని ఆవిడ మీద కేకలు వేస్తాడు'' అన్నాడు

రాజుచిన్నకొడుకు కాదనలేక వెంటవచ్చాడని తెలిసినా రామకృష్ణ, ఆ కుర్రవాడిని సరదాగా ఉంచే ప్రయత్నమే చేశాడు. బస్ ప్రయాణంలో కొంత స్నేహం కుదిరాకా, ''ఇంటిగ్రేటెడ్ ట్యుటోరియల్స్ అంటే ఏమిటి చిన్నా, ట్యుటోరియల్స్ అంటేనే ప్రత్యేకంగా చెప్పటం కదా''. అడిగాడు.

చిన్నకి కొత్తబెరుకు పోయినట్టుంది. నవ్వి సమాధానం చెప్పాడు. ''మాకు తెలిసి ట్యుటోరియల్స్‌లో కొన్ని విషయాలు మాత్రమే చెప్తారు. ఈ తాతగారు భూమ్మీద, ఆకాశంమీద ఆఖరికి చంద్రుడితో సహా ఉండే అన్ని విషయాల గురించి లెక్చర్లిస్తారు. అందుకే ''బిట్స్'' అన్నాం.''

బాబాయి గారింటికి చేరే•సరికి మూడయింది. పిన్ని కాళ్లకి నీళ్లు, మంచినీళ్లు ఇచ్చి కుశల ప్రశ్నలు వేసింది. ఇంకో పావుగంటకి బాబాయి నిద్రలేచి వచ్చాడు. రామకృష్ణని చూసి చాలా సంతోషించాడు. కోడల్ని, పిల్లల్ని, అమెరికా గురించి ప్రశ్నలు వేశాడు.

Story

ప్రశ్నలు సమాధానాలమధ్యే కాఫీ, టిఫిన్లు పూర్తయాయి. ''అమెరికాలో అందరూ ఒకపూటే వండుకుంటారటగా, ఉద్యోగం చేసే ఆడ వాళ్లైతే వారానికి సరిపడే వంట చేసి పెట్టుకుంటారటగా. కోడలు కూడా అలాగే చేస్తుందా?''

ఏం చెప్పాలో తోచని రామకృష్ణ అవుననీ కాదనీ అనకుండా ఎవరి వీలును బట్టి వాళ్లు చేసుకుంటారని'' దాటవేశాడు.

ఏవేవో మాట్లాడుతూ, పక్కన ఎవరూ లేకుండా చూసి ''నీ పిల్లలు హైస్కూలుకి వచ్చారన్నావు. అమెరికాలో పిల్లలకి స్వేచ్ఛ ఎక్కువంటారు. పిల్లల్ని మన పద్ధతులలోనే పెంచుతున్నావా?'' గొంతు తగ్గించి ప్రశ్నించాడు.

పిల్లలు మన పద్ధతుల్లోనే పెరుగుతున్నారని, ఇంట్లో తెలుగే మాట్లాడుతారని చెప్తే తృప్తిగా తలాడించాడు.

''సరేమంచిదే'' అని ఇప్పుడు ఇండియాలో యువతరం ఎంత పాడైపోతోందో, పెద్దవాళ్లన్నా, సంప్రదాయాలన్నా ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో గంటసేపు మాట్లాడాడు. టిఫిన్ తిని అలా బయటికి వెళ్లి వస్తానని వెళ్లిన చిన్నని విమర్శించకుండా ఉండలేదు. అలా మాట్లాడుతుండగానే ఒక పదేళ్లపిల్ల ఒక గిన్నెతో వచ్చింది.

''ఏమిటే పూర్ణా, ఏం తెచ్చావ్'' లోపలికి వెడుతున్న పిల్లని ఆపాడు.

''మా కఱ్రావు రాత్రి ఈనిందండి తాతగారండీ, మీకు మామ్మగారికి జున్ను ఇచ్చి రమ్మంది మా అమ్మ'' సమాధానం చెప్పి కదలబోయింది.

''ఔనే మీ అమ్మ జున్ను బెల్లంతో చేసిందా, పంచదారతోనా?



పాలు ఎన్ని కలిపిందిట?''

''చిన్న పిల్ల అవన్నీ దానికేం తెలుస్తాయి'' లోప ల్నించి వచ్చిన ఆయన భార్య ఆ గిన్నెని, పూర్ణనీ కూడా లోపలికి తీసుకెళ్లిపోయింది.

''మీ పిన్ని వంటయ్యేలోగా అలా తిరిగివద్దాం రారా'' అంటూ బయలుదేరదీశాడు. ఊరు చాలా మారిపోయింది. పల్లెటూరు గుర్తులేవీ లేవు. చిన్న సైజు పట్టణంగా తయారైంది. దార్లో కన్పించిన పరిచయస్తు లందరికీ రామకృష్ణను పరిచయం చేశాడు. అమెరి కాలో ఉంటున్నాడనే విషయం చెప్పటం మర్చిపోలేదు.

''నన్ను గురించి అందరికీ అంత ఎక్కువగా చెప్పా ల్సిన అవసరం ఏముంది?'' అని రామకృష్ణ అనుకో కుండా ఉండలేకపోయాడు.

పలకరించిన వాళ్లవేకాకుండా వాళ్ల బంధువుల కుటుంబాల యోగ క్షేమాలు కూడా విచారించాడు. అడిగినా, అడగకపోయినా వాళ్లకేవో సలహాలిస్తూనే ఉన్నాడు. వాళ్లకీ సలహాలు, అవసరమో, కాదో, వాళ్లు పాటిస్తారో లేదో కూడా రామకృష్ణకి అర్థంకాలేదు. దారిపొడుగునా, నడుస్తున్నంతసేపు కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు ఎంత పాడైపోయాయో, నాయకులు ఎంతతెలివి తక్కువగా నిర్ణయాలు తీసు కుంటున్నారో చెప్తూనే ఉన్నాడు. కొంత సేపు సచిన్ ఎలా ఆడాలో, గంగూలీ ఎందుకు ఫెయిలయ్యాడో, మరొక ఆటగా డికి దూకుడెక్కువ ఎంత ఉందో, ఆలోచిం చకుండా బ్యాట్ ఎలావిసురుతాడో విమర్శి స్తూనే ఉన్నాడు.

ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చేసరికి రామ కృష్ణ పిన్ని వంట పూర్తిచేసి, చిన్నతో కలిసి టి.వి.చూస్తోంది. ఆవిడ ఇచ్చిన మంచినీళ్లు అందుకుంటూ..

''నువ్వు టివి చూడు పిన్నీ, భోజనాలకి ఇంకా టైముందిగా'' అన్నాడు.

''ఫరవాలేదులే నేను రోజూ టివి చూడను'' ఆ సమాధానానికి అతడు ఆశ్చ ర్యపోయాడు.

ఈ దేశంలో ఏ ఇంటికి వెళ్లినా టివి మోగుతూనే ఉంటుంది. ఇన్ని ఛానల్స్, ఇన్ని సీరి యల్స్, సినిమాలు చిన్న, పెద్ద అని లేకుండా అందర్నీ కట్టి పడేస్తున్నాయి. అలాంటిది, రోజంతా తీరికగా ఉండే ఆవిడ టివి చూడనంటుంటే రామకృష్ణకి విచి త్రంగా తోచింది.

''ఏం ఉంటుందిరా ఆ టీవీలో అత్తాకోడళ్ల గొడ వలు, కుట్రలు కుతంత్రాలు, వేసిన సినిమాలే వెయ్యటం, వెర్రి వెర్రి డాన్సులు తప్ప ఏం చూస్తారు'' కాళ్లు కడుక్కుని అప్పుడే లోపలికి వచ్చిన బాబాయి మాటలు విన్న రామకృష్ణకి విషయం బోధపడింది.


''ఇదే వరస, కృష్ణా. టీవీ పెడితే నాకీపురాణం తప్పదు. అందుకే ఆయన ఇంట్లో ఉన్నప్పుడు టీవీ ముట్టుకోను'' గ్లాసులు తీసుకుని లోపలికి వెళ్లిపో యింది.

భోజనాల దగ్గర, పడుకున్నప్పుడు కూడా ఆయన ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు. తన సలహాలు విని, తన సహాయం పొంది ఎందరు బాగుపడ్డారో, తన మాట వినక ఎవరెవరు చెడిపోయారో చెప్తూనే ఉన్నాడు. అలా మాట్లాడుతూనే నిద్రలోకి జారి పోయాడు.

కొత్త ప్రదేశంలో ఒక పట్టాన నిద్రపట్టని రామకృష్ణ భాస్కరం బాబాయిని గురించి ఆలోచించసాగాడు.

ఆయన తోటి వాళ్లందరూ పరిస్థితులతోనూ, వయసుతోనూ రాజీపడ్డారు. పిల్లలకు బాధ్యతలు అప్పగించి, కాలానికి అనుగుణంగా తమతమ జీవి తాలను మార్చుకున్నారు. బాబాయి మాత్రం ఇంకా గతంలోనే ఉండిపోయాడు. తను పెద్దవాడినైపోయా ననీ, తరువాత తరం వాళ్లు వాళ్ల జీవితాలను స్వతం త్రంగా దిద్దుకోగల సామర్థ్యం గలవారనీ గుర్తించటా నికి ఇష్టపడటం లేదు. ప్రపంచంలో, జీవితంలో వస్తున్న నూతనత్వాన్నీ, మార్పులనీ అంగీకరించలేక పోతున్నాడు. ఆయన దృష్టిలో తమతరం వాళ్లు చేసి నవన్నీ మంచివే, అందులో తను అందరి మంచీ గురించి ఆలోచిస్తాడు. ఈ తరం వాళ్లకి ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. ఇటువంటి ఆలోచనలతో భాస్కరం బాబాయి తన ప్రపంచంలో ఉండిపోయా డని రామకృష్ణకి అనిపించింది.

తెల్లవారింది. బాబాయి దగ్గరలో లేనప్పుడు పిన్ని వచ్చి కూర్చుని కబుర్లు చెప్పటం గమనించాడు. ఆవిడ అభిమానం, ఆదరణ ఎప్పటిలాగే ఉన్నాయి. సమయం చూసి తనగోడు రామకృష్ణతో చెప్పుకుంది.




''పిల్లలు వాళ్లదగ్గరకు రమ్మంటారు కృష్ణా. ఈయన వినరు. వాళ్లనే కుటుంబాలతో రమ్మంటారు. ఉద్యోగాల వాళ్లు ఎన్నాళ్లుండగలరు. వారమో, పదిరో జులో అంతే! పాతేసిన పందిరిగుంజలా నాకీ గుమ్మం దిగేందుకు వీలులేదు. ఇంట్లోనూ స్థిమితంగా ఉండని వ్వరు. ఒక దేముడు, పూజ, పురాణం లాంటివి అల వాటు చేసుకోమంటే, భక్తి ముఖ్యం, భగవంతుడు మనసులో ఉండాలిగాని ఈ పైపై భేషజాలు ఎందు కంటారు? ఒక ఊరు లేదు, టీవీ లేదు, సినిమా లేదు, ఆయన మాట్లాడుతుంటే వింటుండాలి. విసుక్కోకూ డదు. ఈయనతో వేగలేక నా తల్లప్రాణం తోకకి వస్తోంది. ఆఖరికి పేరంటానికి వెళ్లినా ఇంతసేపెం దెందుకని, అక్కడ ఎవరెవరున్నారు, ఏం మాట్లా డారు అని ఒకటే ప్రశ్నలు, చంపేస్తారనుకో'' రామకృ ష్ణకి ఆవిడమీద జాలేసింది.

భాస్కరం బాబాయి దృష్టి అంతా రామకృష్ణ మీదే ఉండటంతో చిన్నకి లెక్చర్లు తప్పాయి. భోజనాలు చేసి ఇద్దరూ బయలుదేరారు. ఇద్దరూ బ్యాగులు తీసు కుని వస్తుంటే ఎవరో పిలవడానికి వచ్చారు. మెట్లు దిగుతున్నా, రామకృష్ణకి, చిన్నకి భాస్కరం బాబాయి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

''తప్పకుండా వస్తాం. పెళ్లికి రామా అదిసరేగానీ మీ పెద్దక్కయ్య పెళ్లికి ఎవడోగానీ మంటపానికి మామిడాకులు బోర్లేసి కట్టాడు. ఈసారి సరిగ్గా చూసుకోండి. వంటవాళ్లు అప్పటి వాళ్లేనా? వాళ్లు అర టికాయ కూరలో ఆవ చేదెక్కించేశారు. దగ్గరుండి చెప్పాలి వాళ్ళకి కూర చల్లారాకే ఆవకలపాలని....''

గేటు దాటాక చిన్న నెమ్మదిగా గొణగటం రామకృ ష్ణకి వినపడింది. ''వంట విషయంలో వంటవాళ్ల దగ్గ ర్నుంచీ, మిస్సైల్ ప్రయోగం విషయంలో అబ్దుల్‌క లామ్ కూడా ఈయన ఎవరికైనా సలహాలివ్వ గలడు''.

తిరిగి వచ్చాక రాజు అడిగాడు ''ఏమిటిరా విశే షాలు?'' చెప్పవలసిన విశేషాలన్నీ చెప్పి రామకృష్ణ ఒకమాట అనకుండా ఉండలేకపోయాడు. ''పూర్తిగా పిల్లల్ని తప్పుపట్టలేంరా!''

రాజు నవ్వాడు.

మర్నాడు రామకృష్ణని బస్సెక్కిం చటానికి రాజు, చిన్న వచ్చారు. బస్ ఇంకా రాలేదు. హఠాత్తుగా రామకృష్ణకి అనుమానం వచ్చింది.

''ఏరా చిన్నా! అప్పుడప్పుడు మీకు అరవింద్, అనుపమలకు మధ్య మెయిల్స్ నడుస్తాయిగదా! వాళ్ల క్కూడా ''బిట్స్'' గురించి తెలుసా?''

వాడొక దొంగనవ్వు నవ్వాడు. వాడిని చూస్తూ రామకృష్ణకి నవ్వొ చ్చింది. రాజు కూడా జతకలిశాడు.

''దొంగరాస్కెల్స్ మా పిల్లల క్కూడా తెలుసు. నాకే తెలియకుండా దాచారన్న మాట'' వాడి భుజం మీద చరిచాడు.

బస్ వచ్చి ఎక్కి కూర్చున్నాక చిన్నా అన్నాడు.

''మామయ్యా, అత్తయ్యకి కూడా బిట్స్ గురించి తెలుసు''.

వాణ్ణేమనాలో రామకృష్ణకి అర్థం కాలేదు. బెదిరిం పుగా తర్జని చూపించాడు. చిన్న, రాజు నవ్వుతూ టాటా చెప్పారు.

''వీళ్ల పిల్లలా, పిడుగులా'' అనుకున్నాడు.

ఈ తరాన్ని తక్కువగా అంచనా వెయ్యకూడదు. వాళ్ల ఆలోచనలు, ఆశలు, పరిశీలన చాలా వేగంగా, తీవ్రంగా ఉంటాయి. 'కడుపు నిండితే గారెలు చేదు' అని ఒకప్పటి సామెత. ఇది బర్గర్లు, పిజ్జాల యుగం. కడుపునిండినా, నిండక పోయినా ఇప్పటి పిల్లలకు, వాళ్లకి అవసరమైన విషయాలు, నచ్చని అంశాలు చేదుగారెలతో సమానమే. వాళ్లు చేదుగారెలను ఇష్టప డరు. బస్‌తోపాటుగా రామకృష్ణ ఆలోచనలు కూడా పరుగెత్తసాగాయి.

*